సాక్షి
వికారాబాద్
గురువారం । 7 । డిసెంబర్ । 2023



కొనుగోలు కేంద్రాల జాడేది?

పెద్దేముల్ మండలంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 8లో▸



అదిగో పులి..

చేవెళ్ల మండలంలో పులి తిరుగుతుందనే ప్రచారం 15రోజులుగా సోషల్ మీడియాలో చకర్లు కొడుతూనే ఉంది. 8లో▸



నైతిక విజయం మనదే

చేవెళ్లలో కాంగ్రెస్ పార్టీ ఓడినప్పటికీ నైతికంగా విజయం సాధించినట్లేనని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి భీంభరత్ అన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

ఎంపీ రంజిత్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రంజిత్‌రెడ్డి

మోమిన్‌పేట: ప్రజాస్వామ్య వ్యవస్థలో గెలుపోటములు సహజమని, ఎవరూ అధైర్యపడరాదని చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఏజేఆర్ ఫంక్షన్ హాల్‌లో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మెతుకు ఆనంద్‌తో కలిసి మాట్లాడారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమన్నారు. ఆనంద్ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ ఎంతో శ్రమించారని పేర్కొన్నారు. ప్రజలు మార్పును కోరుకున్నారని, వారి అభీష్టం మేరకు నడుచుకోవాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు డీ వెంకట్,మాజీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరికీ దైవచింతన ఉండాలి

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



స్వామివారికి హారతి ఇస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరులు

అనంతగిరి: ప్రతి ఒక్కరికీ దైవచింతన ఉండాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. బుధవారం వికారాబాద్ పట్టణంలోని గిరిధర్‌రెడ్డి నివాసంలో రుద్రాభిషేకం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొని శివునికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడవాలన్నారు. వికారాబాద్‌లో నెల రోజులుగా రుద్రాభిషేకాలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా లక్ష్మణ్



వికారాబాద్ అర్బన్: ఆర్యవైశ్య సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా మాలె లక్ష్మణ్ గుప్తాను నియమించారు. ఈ మేరకు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కటకం శివకుమార్ గుప్తా బుధవారం ప్రకటన విడుదల చేశారు. రాజకీయాల్లో చురుగ్గా ఉంటూ, ఆర్యవైశ్య సంఘం కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొంటున్న లక్ష్మణ్‌ను జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ గుప్తా మాట్లాడుతూ.. తనపై ఎంతో నమ్మకంతో జిల్లా ప్రధాన కార్యదర్శి బాధ్యతలు అప్పగించిన సంఘం పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘం అభివృద్ధికి పాటుపడతానని తెలిపారు.

వ్యాక్సినేషన్ వివరాల నమోదు తప్పనిసరి

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జయలక్ష్మి



వైద్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న డాక్టర్ జయలక్ష్మి

కొత్తూరు: వ్యాక్సినేషన్ల వివరాలను తప్పనిసరిగా రిజిస్టర్‌లో నమోదు చేయాలని షాద్‌నగర్ ఏరియా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జయలక్ష్మి ఆదేశించారు. బుధవారం ఆమె మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్ సబ్‌సెంటర్‌ను పరిశీలించి ఏఎన్‌ఎంలకు పలు సూచనలిచ్చారు. అనంతరం టీకా పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ హరికిషన్, ఏఎన్‌ఎంలు, ఇతర సిబ్బంది ఉన్నారు.

‘తెల్ల’బోయె..

పత్తి ధర తగ్గడంతో రైతన్న దిగాలు

- ఇళ్లల్లోనే నిల్వలు
- ధర పెరుగుతుందని ఆశలు
- మోసాలకు పాల్పడుతున్న దళారులు



పెద్దేముల్ మండలంలో పత్తి కొనుగోలు చేస్తున్న దళారులు

పెద్దేముల్: పత్తి ధర తగ్గడంతో రైతన్నలు ఆందోళనకు గురవుతున్నారు. దీంతో పత్తి విక్రయించాలా లేదా అనే ఆలోచనలో పడ్డారు. మూడేళ్ల నుంచి భారీ వర్షాలు పడడం, పెట్టుబడులు రెండింతలు పెరగడం, పంటలు పాడవడం, దిగుబడి తగ్గడం వంటివి చోటుచేసుకున్నా ధర అనుకూలంగా ఉండేదని రైతులు తెలిపారు. ఈ ఏడాది దిగుబడి తగ్గడంతో పాటు, ధర లేక పోవడంతో ఏమి చేయాలో దిక్కు తోచడం లేదని వాపోయారు. గతంలో క్వింటాలు పత్తి రూ.10వేల వరకు ఉండడంతో ఎక్కువ మంది రైతులు పత్తి పంట సాగు చేశారు. అయితే ప్రభుత్వం క్వింటాలు పత్తికి రూ.7,020 మద్దతు ధర ప్రకటించడంతో పత్తి రైతులు అయోమయంలో పడిపోయారు. రాష్ట్ర ప్రభుత్వం పత్తి పంటను ప్రోత్సహించడంతో రెండేళ్ల నుంచి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. మంచి ధర వస్తుందని భావించి ఈ ఏడాది పంట దిగుబడిని ఇళ్లల్లో నిల్వ చేసుకున్నారు. అయితే రోజు రోజుకు ధర తగ్గుతుండడం రైతులను ఆందోళనకు గురి చేస్తోంది. విధిలేని పరిస్థితిలో దళారులను ఆశ్రయించి నష్టపోతున్నారు. మండలంలోని కందనెల్లి, మంబాపూర్, ఆత్కూర్, పెద్దేముల్, గాజీపూర్, బుద్దారం, ఇందూరు, మారేపల్లి, నాగులపల్లి, గోపాల్‌పూర్, తింసాన్‌పల్లి, హన్మాపూర్, గిర్మాపూర్, గొట్లపల్లి గ్రామాల్లో సుమారు 10వేల ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు. ఈ ఏడాది భారీ వర్షాలకు లోతట్టు భూములు నీటమునిగి పంటలు పాడయ్యాయి. ఉన్న కొద్దిపాటి పంటలకు పురుగు మందు పిచికారీ చేసి కాపాడుకున్నారు. అయితే ధర లేక నష్టపోతున్నారు. గతంలో పెట్టుబడులు పోను ఎకరాకు రూ.5వేల నుంచి రూ.10వేల వరకు మిగిలేది. ప్రస్తుతం దిగుబడి, ధర తగ్గడంతో నష్టాలను చవిచూస్తున్నారు.

మద్దతు ధర పెంచాలి



పెట్టుబడులకు అనుగుణంగా పత్తి పంటకు మద్దతు ధర పెంచాలి. ప్రస్తుతం సీసీఐ ధర రూ.7వేలు ఉంది. ఈ మొత్తాన్ని రూ.10వేలకు పెంచాలి. అప్పుడే పత్తి రైతుకు న్యాయం జరుగుతుంది. ఆ దిశగా ప్రభుత్వం చొరవ చూపాలి. లేకుంటే అప్పులపాలవుతాం.

– వెంకటేశం, రైతు, జనగాం

పెట్టుబడులు పెరిగాయి



పత్తి సాగులో పెట్టుబడులు భారీగా పెరిగాయి. ఎరువులు, విత్తనాలు ధరలు ఏటా పెరుగుతున్నాయి. కానీ ప్రభుత్వం మద్దతు ధర పెంచడం లేదు. కూలీల రేట్లు కూడా విపరీతంగా పెరిగాయి. దీంతో ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర ఏమాత్రం సరిపోవడం లేదు.

– శ్రీనివాస్, రైతు, దుగ్గాపూర్

మోసాలకు పాల్పడితే చర్యలు

పత్తి కొనుగోలులో దళారులు మోసాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటాం. తూకంలో తేడా ఉంటే వెంటనే మాకు ఫిర్యాదు చేయండి. పెద్దేముల్ మండలంలో 20 రోజుల క్రితం రెండు కేసులు నమోదు చేశాం. ఫిర్యాదు చెప్పిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతాం. రైతుల నుంచి పత్తి సేకరించే వ్యాపారులు తూకం సరిగ్గా వేయాలని ఆదేశించారు. లేకుంటే చర్యలు తప్పవన్నారు.

– రియాజ్ హైమద్ ఖాన్, జిల్లా తూనికల అధికారి

రాష్ట్ర సహకార సంఘం చైర్మన్ రాజీనామా



రాజావరప్రసాద్

షాద్‌నగర్: రాష్ట్ర సహకార సంఘం చైర్మన్ బాధ్యతలకు రాజావరప్రసాద్ రాజీనామా చేశారు. బుధవారం ఆయన రాజీనామా పత్రాన్ని సహకార సంఘం మేనేజింగ్ డైరెక్టర్ అరుణ గోపరాజు ద్వారా సహకార శాఖ కార్యదర్శి రఘునందన్‌రావుకు పేషికి పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ఓటమి చెందడంతో చైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. సహకార సంఘం బలోపేతం కోసం తీసుకోవాల్సిన చర్యలపై తాను రూపొందించిన ప్రత్యేక నివేదికను ప్రభుత్వానికి పంపించానని తెలిపారు, చైర్మన్‌గా పని చేసే అవకాశాన్ని కల్పించిన మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కూనంనేనికి ఘన సన్మానం



ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును సన్మానిస్తున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: కొత్తగూడెం శాసనసభ్యుడిగా ఎన్నికైన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావును ఆ పార్టీ నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. నగరంలోని హిమాయత్‌నగర్‌లో ఉన్న సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో షాద్‌నగర్ సీపీఐ నాయకులు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కన్వీనర్ పానుగంటి పర్వతాలు, కోకన్వీనర్లు బుద్దుల జంగయ్య, శ్రీను, జిల్లేడు చౌదరిగూడ మండల కార్యదర్శి వెంకటేష్, నందిగామ మండల కార్యదర్శి జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

నిఘా నీడలో నగరం

- సీఎం ప్రమాణ స్వీకారానికి భారీ భద్రత
- పటిష్ట బందోబస్తుకు ప్రణాళికలు సిద్ధం
- ఎల్బీ స్టేడియం కేంద్రంగా ట్రాఫిక్ ఆంక్షలు

సాక్షి, సిటీబ్యూరో: సీఎల్పీ నేతగా ఎన్నికైన రేవంత్ రెడ్డి గురువారం మధ్యాహ్నం తెలంగాణ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఎల్బీ స్టేడియంలో జరిగే ఈ కార్యక్రమానికి నగర పోలీసు విభాగం పటిష్ట భద్రత, బందోబస్తు ఏర్పాట్లు చేస్తోంది. సాధారణ ప్రజలకు ఇబ్బందులు లేకుండా స్టేడియం కేంద్రంగా ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం కోసం ఎల్బీ స్టేడియంలో మూడు స్టేజ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. వాటిపై ఉండే ప్రముఖుల వివరాల ఆధారంగా బందోబస్తు ప్రణాళికలు సిద్ధం చేశారు. బుధవారం స్టేడియంలోకి వెళ్లిన సీఎస్ శాంతికుమారి, డీజీపీ రవి గుప్తా, నగర పోలీసు కమిషనర్ సందీప్ శాండిల్య, మాజీ కొత్వాల్ సీవీ ఆనంద్ సహా ఇతర ఉన్నతాధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గురువారం ఉదయం 10గంటల నుంచే బందోబస్తు సిబ్బంది విధుల్లో ఉండనున్నారు. దీనికోసం పోలీసు విభాగం దాదాపు 2 వేల మందిని వినియోగిస్తోంది. బుధవారం మధ్యాహ్నం స్టేడియం వద్దకు వచ్చిన బలగాలు రిహార్సల్స్ సైతం పూర్తి చేశాయి.

ఏర్పాట్లు ఇలా..

జూబ్లీహిల్స్‌లోని రేవంత్‌రెడ్డి నివాసం నుంచి ఎల్బీ స్టేడియం వరకు ఉన్న మార్గం పర్యవేక్షణకు ప్రత్యేక రూట్ పార్టీ సైతం ఏర్పాటు చేస్తున్నారు. ఆయా మార్గాలను ప్రత్యేక బాంబు నిర్వీర్య బృందాలతో అడుగడుగునా తనిఖీ చేయిస్తున్నారు. ఎల్బీ స్టేడియం చుట్టూ అనునిత్యం ప్యాట్రోలింగ్ నిర్వహించడానికి ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపుతున్నారు. బందోబస్తు, భద్రత విధుల్లో సీఎం సెక్యూరిటీ విభాగంతో పాటు ఆక్టోపస్, శాంతి భద్రతలు, టాస్క్‌ఫోర్స్, సిటీ సెక్యూరిటీ వింగ్, ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్, సీఏఆర్ విభాగాలు, సాయుధ బలగాల సిబ్బంది పాల్గొనున్నారు. గురువారం ఉదయం నుంచే ఆయా ప్రాంతాల్లో నిఘా, తనిఖీలు ముమ్మరం చేయడంతో పాటు పెద్ద ఎత్తున మఫ్టీ పోలీసులను మోహరించనున్నారు. రూఫ్ టాప్ వాచ్ కోసం స్టేడియం చుట్టుపక్కల ఎత్తైన బిల్డింగ్స్‌పైన సుశిక్షితులైన సాయుధ బలగాలను మోహరిస్తున్నారు. స్టేడియం చుట్టూ రహదారుల్లో నిలిచిపోయిన ప్రజల సౌకర్యార్థం దాదాపు ఆరు భారీ స్క్రీన్లు ఏర్పాటు చేయాలని పోలీసులు ప్రతిపాదించారు.

ట్రాఫిక్ ఆంక్షలు

ఎల్బీ స్టేడియంలో కేంద్రంగా ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తూ ట్రాఫిక్ చీఫ్ జి.సుధీర్‌బాబు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇవి అమలులో ఉండనున్నాయి. వాహన చోదకులు వీటిని దృష్టిలో పెట్టుకుని తమకు సహకరించాల్సిందిగా ఆయన కోరారు.



పరిగి: రేవంత్‌రెడ్డికి బొకే అందజేస్తున్న టీఆర్‌ఆర్

నేడే ప్రమాణ స్వీకారం

- జిల్లా నుంచి రెండో సీఎంగా రేవంత్
- నాడు మర్రి.. నేడు ఎనుముల
- అభివృద్ధిపై జిల్లా ప్రజల ఆశలు

వికారాబాద్/కొడంగల్: జిల్లాకు చెందిన ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రిగా గురువారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. జిల్లా నుంచి సీఎం పీఠాన్ని అధిష్టించనున్న రెండో వ్యక్తిగా చరిత్ర లిఖించనున్నారు. గతంలో జిల్లాకు చెందిన మర్రి చెన్నారెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా సేవలందించగా ప్రస్తుతం కొడంగల్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన రేవంత్‌రెడ్డి సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇదే విషయం ఇప్పుడు జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది. జిల్లాలో ఎక్కడ చూసినా ఇప్పుడు ఇదే విషయం చర్చించుకుంటున్నారు. రేవంత్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి స్వచ్ఛందంగా తరలివెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. జిల్లా నుంచి సీఎంగా రేవంత్‌రెడ్డి ఉండనుండటంతో ఇక మరో బెర్తు కష్టమేననే వార్తలు వినిపిస్తున్నాయి. వికారాబాద్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్, పరిగి ఎమ్మెల్యే టీఆర్‌ఆర్ మంత్రి పదవుల కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. అయితే వారి ప్రయత్నాలు ఎంత వరకు ఫలిస్తాయో చూడాల్సి ఉంది. రేవంత్‌రెడ్డి సీఎం కానుండటంతో జిల్లా వాసుల్లో అభివృద్ధిపై ఆశలు చిగురిస్తున్నాయి. వికారాబాద్ జిల్లా ఇప్పటి వరకు పెద్దగా అభివృద్ధికి నోచుకోలేదు. కనీసం రోడ్లు, సాగునీటి తదితర అవసరాలు తీర్చే నాథుడు లేడు. ఉత్తర తెలంగాణతో పోలిస్తే ఎంతో వెనుకబాటుకు గురవుతూ వచ్చింది. సారవంతమైన భూములు ఉన్నప్పటికీ సాగునీరు అందడం లేదు. పాలమూరు ఎత్తిపోతల పథకం, కృష్ణా రైల్వే లైన్, హైదరాబాద్‌కు రోడ్డు విస్తరణ తదితర పనులు ఎన్నికల హామీలుగానే మిగులుతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాకు చెందిన వ్యక్తి సీఎం కానుండడంతో ఇక్కడి ప్రజల్లో ఆశలు చిగురించాయి.

కొడంగల్ నుంచి..

కొడంగల్: రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమానికి కొడంగల్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీగా తరలివెళుతున్నారు. కొందరు స్వచ్ఛందంగా వాహనాలు సమకూర్చుకొని వెళుతుండగా, పార్టీ నాయకులు వారివారి వాహనాల్లో హైదరాబాద్‌కు బయలుదేరారు.

రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన టీఆర్‌ఆర్

పరిగి: తెలంగాణకు కాబోయే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బుధవారం పరిగి ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి ఢిల్లీలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అధిష్టానం రేవంత్‌రెడ్డిని సీఎంగా ప్రకటించడంతో ఆయన హుటాహుటిన ఢిల్లీకి వెళ్లారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుందని ఖర్గేకు తెలిపారు.

అమాత్యులెవరో?



- సిటీలో ఖాతా తెరవని కాంగ్రెస్
- ఉమ్మడి జిల్లాలో లక్కు ఎవరికో..?
- నేడు మంత్రి వర్గ ప్రమాణ స్వీకారం నేపథ్యంలో జోరుగా చర్చ

సాక్షి, రంగారెడ్డిజిల్లా: తెలంగాణ నూతన కేబినెట్‌లో గ్రేటర్ జిల్లాల నుంచి ఎవరికి అమాత్య పదవి వరిస్తుందోనని సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. హైదరాబాద్ జిల్లా పరిధిలో 15 అసెంబ్లీ సెగ్మెంట్లుండగా ఇక్కడ హస్తం బోణీ కొట్టలేదు. దీంతో నగరం నుంచి మంత్రి వర్గంలో సిటీ ప్రాతినిధ్యం లేనట్లే. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని 17 నియోజకవర్గాలకు గాను ఏడు స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి, షాద్‌నగర్, వికారాబాద్, పరిగి, తాండూరు, కొడంగల్ సెగ్మెంట్లు హస్తగతమయ్యాయి. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి విజయం సాధించిన కొడంగల్ నియోజకవర్గం వికారాబాద్ జిల్లాలో ఉంది. జిల్లా నుంచే సీఎంగా అవకాశం దక్కడంతో ఆ జిల్లాకు మరొకరికి మంత్రి పదవి దక్కే అవకాశం తక్కువే. రంగారెడ్డి జిల్లా నుంచి గెలుపొందిన ముగ్గురు అభ్యర్థుల్లో ఒకరికి బెర్త్ కన్ఫర్మ్ అంటూ ప్రచారం సాగుతోంది.

రామ్మోహన్‌రెడ్డికా? మల్‌రెడ్డికా?

రంగారెడ్డి జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాలుండగా ఇబ్రహీంపట్నం సెగ్మెంట్ నుంచి మల్‌రెడ్డి రంగారెడ్డి, కల్వకుర్తి నుంచి కసిరెడ్డి నారాయణరెడ్డి, షాద్‌నగర్ నుంచి వీర్లపల్లి శంకరయ్య గెలుపొందారు. వీరిలో ప్రస్తుత ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఉమ్మడి రాష్ట్రంలో మలక్‌పేట్ నియోజకవర్గం నుంచి 1994, 2004లో రెండు పర్యాయాలు శాసనసభకు ఎంపికయ్యారు. నియోజకవర్గ పునర్విభజన అనంతరం ఆయన 2009లో ఇబ్రహీంపట్నం నుంచి, 2014లో మహేశ్వరం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2018లో ఇబ్రహీంపట్నం నుంచి పొత్తులో భాగంగా కాంగ్రెస్ నుంచి టికెట్ దక్కకపోవడంతో బీఎస్పీ నుంచి బరిలో నిలిచి స్వల్ప తేడాతో ఓటమిని చవిచూశారు. తాజాగా ఇదే స్థానం నుంచి భారీ మెజార్టీతో గెలుపొందారు. ఏవిధంగా చూసినా జిల్లా నుంచి సీనియర్ ఎమ్మెల్యే మల్‌రెడ్డి మాత్రమే ఉన్నారు. రంగారెడ్డి జిల్లాకు మంత్రి వర్గంలో ప్రాతినిధ్యం కల్పించాలని భావిస్తే ఆయనకే దక్కే ఛాన్స్ ఉంది. అధికారికంగా ఎటువంటి ప్రకటన లేనప్పటికీ ఆయన క్రీడల శాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారని అభిమానులు, పార్టీ కేడర్‌లో జోరుగా చర్చ సాగుతోంది. ఒక వేళ వికారాబాద్ నుంచి అవకాశం కల్పించాలని భావిస్తే డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి అందరికంటే ముందు వరసలో ఉండే అవకాశం ఉంది.

భద్రత భేష్

- ప్రశాంతంగా ఎన్నికలు పూర్తి చేయడంలో పోలీసు శాఖ సక్సెస్
- సత్ఫలితాలు ఇచ్చిన ముందస్తు చర్యలు
- పెద్ద మొత్తంలో నగదు, మద్యం, గంజాయి సీజ్
- ఉన్నతాధికారుల ప్రశంసలు



ఎన్నికల విధుల్లో భాగంగా కవాతు నిర్వహిస్తున్న పోలీసులు (ఫైల్)

తాండూరు: అసెంబ్లీ ఎన్నికల నిర్వహణలో కీలకంగా పనిచేసిన జిల్లా పోలీసులు ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు అందుకున్నారు. జిల్లాలో పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సెగ్మెంట్ ఉండటం మరోవైపు వికారాబాద్, పరిగి, తాండూరు నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీలకు చెందిన నేతలు బరిలోకి దిగడంతో పోలింగ్ రోజు గొడవలు జరిగే అవకాశం ఉందని అంతా భావించారు. కానీ ఎక్కడా ఎలాంటి సమస్య తలెత్తకుండా ఎస్పీ కోటిరెడ్డి నేతృత్వంలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మరోవైపు ప్రజల్లో వచ్చిన చైతన్యంతో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగలేదు.

1,819 మంది విధులు

జిల్లాలోని నాలుగు అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో 1,822 మంది పోలీసు సిబ్బంది విధులు నిర్వహించారు. ఇందులో ఎస్పీతో పాటు నలుగురు డీఎస్పీలు, 19 మంది సీఐలు, 33 మంది ఎస్సైలు, 205 మంది ఏఎస్సైలు, 883 మంది కానిస్టేబుళ్లు, 678 మంది హోంగార్డులు ఎన్నికల విధులు నిర్వహించారు. మరోవైపు కర్ణాటక నుంచి 850 మంది పోలీసులు విధుల్లో పాల్గొన్నారు.

అక్రమ రవాణాకు అడ్డుకట్ట

అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నాటి నుంచి జిల్లా పోలీసు శాఖ అక్రమ రవాణాపై నిఘా పెంచారు. తెలంగాణ– కర్ణాటక అంతర్రాష్ట్ర సరిహద్దు మార్గాల్లో చెక్ పోస్ట్‌లు ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టారు. మరోవైపు కర్ణాటక సరిహద్దులో అక్కడి పోలీసులు సైతం చెక్ పోస్ట్‌లు ఏర్పాటు చేసి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేశారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నాటి నుంచి జిల్లాలో రూ.22.56 లక్షల విలువ కలిగిన 4,087 లీటర్ల లిక్కర్ బాటిళ్లను సీజ్ చేసి 267 కేసులు నమోదు చేశారు. మరోవైపు ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న 45 తులాల బంగారం(విలువ రూ.22.90లక్షలు) సీజ్ చేశారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభ పెట్టించేందుకు తరలిస్తున్న రూ.9.61 లక్షల విలువ కలిగిన 42 గిఫ్ట్ ప్యాకెట్లు, స్మార్ట్ ఫోన్లు, టీ థర్మాస్‌లు, టీ కప్స్, పర్ఫ్యూమ్ బాటిళ్లతో పాటు పలు వస్తువులను సీజ్ చేశారు. రూ.5.95 లక్షల విలువైన 24 కేజీల గంజాయిని పట్టుకున్నారు.

పాత నేరస్తుల బైండోవర్

నేర చరిత్ర కలిగిన వారిని జిల్లా పోలీసు శాఖ అసెంబ్లీ ఎన్నికలకు ముందుగా బైండోవర్ చేసింది. అందులో రౌడీ షీటర్లు, కేడీలతో పాటు 2,471 మంది పాత నేరస్తులు ఉన్నారు. వీరిపై ఎప్పటికప్పుడు ని ఘా పెట్టారు.దీంతో ఎన్నికలు ప్రశాంతంగా జరిగా యి.బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు తనిఖీ చేస్తుండగా రూ.44 లక్షలు పట్టుబడ్డాయి. కరన్‌కోట్ ఠాణా పరిధిలో మరో కేసు నమోదైంది.

కొనసాగుతున్న మెథడిస్టు జాతర



ధారూరు: మండలంలోని ధారూర్ మెథడిస్టు జాతర బుధవారం రెండో రోజు కొనసాగుతుంది. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు జాతరకు తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసుప్రభువు శిలువ వద్ద కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు నిర్వహించారు.

క్లుప్తంగా

నేడు అనంతగిరి పుణ్యక్షేత్ర ప్రదక్షిణ

అనంతగిరి: అనంతగిరి పుణ్యక్షేత్ర గిరి ప్రదక్షిణ కార్యక్రమం గురువారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం 5.30గంటలకు రాజీవ్‌నగర్‌ కాలనీ వద్ద గల భవానీ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి పాదయాత్ర ప్రారంభమవుతుందన్నారు. పాదయాత్ర రాజీవ్‌నగర్‌ మీదుగా శుభం ఫంక్షన్‌ హాల్‌, గోధుమగూడ, కేరెల్లి, బుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయం, రాజీవ్‌గృహకల్ప, బండబావి మీదుగా సాయంత్రం అనంతగిరి పుష్కరిణి వద్దకు చేరుకుంటుందన్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు, హారతితో ఈ యాత్ర ముగుస్తుందని వారు తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ధారూరు: ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం విక్రయించాలని పీఏసీఎస్‌ చైర్మన్‌ సత్యానారాయణరెడ్డి అన్నారు. మండల పరిధిలోని నాగారం, గురుదొట్లలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో ఏ–గ్రేడ్‌ రకం ధాన్యం క్వింటాల్‌కు రూ.2,203, సాధారణ రకానికి క్వింటాల్‌కు రూ.2,183 కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తామన్నారు. రైతులు 17శాతం తేమతో ఉన్న నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈఓ కరీం, డైరెక్టర్లు తులసీరామ్‌, మల్లయ్య, కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జిలు బాబుగౌడ్‌, రఘురాంరెడ్డి, ఏఈఓలు ప్రసాద్‌గౌడ్‌, సంతోష్‌ ఉన్నారు.

రాష్ట్రానికి మంచిరోజులు

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్‌: సీఎల్‌పీ నేత, తెలంగాణ రాష్ట్రానికి కాబోయే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో బుధవారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి మంచి రోజులు రాబోతున్నాయని అన్నారు. రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

వృత్తివిద్యా కోర్సుల్లో మహిళలకు శిక్షణ

కొందుర్గు: యూనియన్‌ బ్యాంక్‌, జీఎంఆర్‌ వరలక్ష్మి ఫౌండేషన్‌, స్వర్ణ భారత్‌ ట్రస్ట్‌ సంయుక్త ఆధ్వర్యంలో మహిళలకు వివిధ రంగాల్లో వృత్తివిద్యా కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లేడ్‌ చౌదరిగూడ ఎంపీడీఓ మహేష్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మగ్గం వర్క్స్‌, టైలరింగ్‌, బ్యూటీషియన్‌, జూట్‌ బ్యాగ్‌ల తయారీ తదితర కోర్సుల్లో శిక్షణ ఇస్తారని తెలిపారు. పూర్తి వివరాల కోసం 93914 87797, 91771 41712 ఫోన్‌ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కేసీఆర్‌ వెంటే ఉంటాం

షాబాద్‌: తన ఊపిరి ఉన్నంత వరకు కేసీఆర్‌ వెంటే ఉంటానని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. బుధవారం మండలానికి చెందిన రాజేందర్‌గౌడ్‌, మతీన్‌, వెంకటయ్య ఎమ్మెల్యేను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో కేసీఆర్‌ ఎమ్మెల్యే టికెట్‌ ఇచ్చారన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో తనపై అభిమానంతో ఓటేసిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. చేవెళ్ల నియోజకవర్గం అభివృద్ధి కోసం తనవంతు పాటుపడతానని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు తదితరులున్నారు.

కొనుగోలు కేంద్రాల జాడేది?

పంటలు శుద్ధిచేసి ఇరువై రోజులు దాటింది.. నేటికీ కొనుగోలు కేంద్రాలు, గన్నీ బ్యాగుల జాడలేదు... దీంతో ధాన్యాన్ని పంటపొలాలు, రోడ్లపై ఆరబెట్టాం. గతేడాది నవంబర్‌ నెలలోనే ప్రభుత్వం కొనుగోళ్లు ప్రారంభించింది. ఈ ఏడాది డిసెంబర్‌ మాసం ప్రారంభమైనప్పటికీ కొనుగోళ్ల జాడలేదని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- వరికోతలు ప్రారంభమై మాసం పూర్తి
- ఇప్పటికీ సెంటర్లను ప్రారంభించని సర్కార్‌
- పొలాలు, రోడ్లపై ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు



పొలంలో నిల్వ ఉంచిన ధాన్యం

పెద్దేముల్‌: పెద్దేముల్‌ మండలంలోని గాజీపూర్‌, బుద్దారం, పెద్దేముల్‌, జనగాం, దుగ్గాపూర్‌, రుక్మాపూర్‌, మంబాపూర్‌, మారేపల్లితండా, మదనంతపూర్‌తో పాటు పలు గ్రామాల్లో ఈ ఏడాది రైతులు వరిపంటను అధికంగా సాగు చేశారు. గతేడాది ఖరీఫ్‌ 4,300 ఎకరాల్లో సాగుచేయగా, ఈ ఏడాది 5134 ఎకరాల్లో వరిపంట సాగుచేయడం జరిగిందని ఏఈఓ నజీరుద్దీన్‌ తెలిపారు. అన్ని గ్రామాల్లో వరి కోతలు ప్రారంభమై సుమారు నెలరోజులు గడుస్తున్నప్పటికీ ఇంతవరకు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించక పోవడం ఏంటని రైతులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం ఖరీదు చేయమని స్పష్టంగా చెప్పేస్తే మార్కెట్లో విక్రయాలు చేస్తామని.. వెంటనే నిర్ణయం తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. కేంద్రాలు ప్రారంభం కాక రోడ్లపై, పంట పొలాల్లో ధాన్యం వేయవలసి వచ్చిందని, దానికి తోడు తుఫాన్‌ ప్రభావంతో ధాన్యం ఎక్కడ తడిసిపోతుందోనని ఆందోళనగా ఉందని అన్నారు.

గతేడాది నవంబర్‌లోనే ప్రారంభం

గతేడాది నవంబర్‌ నాటికి డీసీఎంఎస్‌ల ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ ఏడాది డిసెంబర్‌ వచ్చినా కేంద్రాల జాడలేదు. అయితే ఈ ఏడాది పరిస్థితులు ఇందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. గతేడాదికంటే ఈ ఏడాది సాగు అధికంగా అవ్వడంతో పాటు పెట్టుబడులు, ఎరువుల ధరలు కూడ పెరిగాయని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం సమయానికి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోతే తాము తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

జాడలేని బార్‌దాన్‌

వరిపంటలు శుద్ధిచేసి సుమారు నెలరోజులు అవుతున్నా ఇంతవరకు బార్‌దాన్‌ జాడలేదు. శుద్ధిచేసిన ధాన్యంను పంట పొలాలు, రోడ్లపై నిల్వ ఉంచినందున ప్రభుత్వం వెంటనే రైతులకు బార్‌దాన్‌ను అందచేయాలని రైతులు కోరుతున్నారు. గతంలో పంటలు కొతలు కాకముందే బార్‌దాన్‌ అందచేసేదని... ఏడాది నుంచి సక్రమంగా బార్‌దాన్‌ అందక తంటాలు పడుతున్నామని రైతులు వాపోతున్నారు. వెంటనే బార్‌దాన్‌లు అందజేయడంతో పాటు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు.

కేంద్రాలు ప్రారంభించాలి



ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి. పెద్దేముల్‌, జనగాం, గాజీపూర్‌లో సాగు అధికంగా ఉన్నందున ఇక్కడ వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి. బార్‌దాన్‌ కూడా సక్రమంగా అందటం లేదు. అధికారులకు కూడా ఫిర్యాదు చేశాం. చర్యలు తీసుకోవాలి.

– ముకుందు రెడ్డి, రైతు, జనగాం

12 ఎకరాల్లో వరి సాగుచేశా



30 ఏళ్ల నుంచి వరిపంట సాగుచేస్తున్నాను. ఈ ఏడాది 12 ఎకరాల్లో వరి పంటను సాగుచేశాను. ఏకరాకు రూ.30వేల వరకు పెట్టుబడి అయ్యింది. దిగుబడి అనుకూలంగా ఉన్నా కొనుగోలు కేంద్రాలు లేక ఇబ్బందులు పడుతున్నాం. గాజీపూర్‌లో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి.

– ప్రకాశ్‌రెడ్డి, రైతు, గాజీపూర్‌

ప్రతీ గింజ కొనుగోలు చేస్తాం



జిల్లావ్యాప్తంగా త్వరలో వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తాం. ఈవిషయమై కలెక్టర్‌ ఆదేశాలు వచ్చాయి. ఎన్నికల దృష్ట్యా కాస్త ఆలస్యం అయ్యింది. పెద్దేముల్‌, గాజీపూర్‌లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు కోరారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా. ప్రతి గింజ కొనుగోలు చేస్తాం.

– నజీరుద్దీన్‌, ఏఓ,పెద్దేముల్‌

సైన్స్‌ ఫెయిర్లతో సృజనాత్మకత



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న వినాయకరెడ్డి, జ్ఞానేశ్వర్‌

సీఐ వినాయకరెడ్డి

శంకర్‌పల్లి: విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు సైన్స్‌ఫెయిర్‌లు ఎంతో ఉపయోగపడతాయని శంకర్‌పల్లి సీఐ వినాయకరెడ్డి, మున్సిపల్‌ కమిషనర్‌ జ్ఞానేశ్వర్‌ పేర్కొన్నారు. సీజీఐ, ఎల్‌ఎల్‌ఎఫ్‌, ఏఐఎం, నీతి ఆయోగ్‌ సంయుక్తంగా బుధవారం శంకర్‌పల్లి ఆదర్శ పాఠశాలలో స్టెమ్‌ స్పార్క్‌ ఇన్నోవేషన్‌ ఫెస్ట్‌ (2023–24) సైన్స్‌ఫెయిర్‌ నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో వరంగల్‌, భద్రాచలం, సిద్దిపేట, హైదబాద్‌, రంగారెడ్డి జిల్లాలకు చెందిన 15 జిల్లా పరిషత్‌, ఆదర్శ పాఠశాల విద్యార్థులు.. 50కి పైగా సైన్స్‌ ప్రాజెక్టులను ప్రదర్శించారు. విద్యార్థులు రూపొందించిన ప్రయోగాలను అతిథులు పరిశీలించిన అంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో శంకర్‌పల్లి మండల విద్యాధికారి అక్బర్‌, ఆదర్శ పాఠశాల ప్రిన్స్‌పాల్‌ ఉమా మహేశ్వర్‌రావు, పలు సంస్థల సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంచాయతీ సెక్రటరీ ఆత్మహత్య



వెంకటయ్య (ఫైల్‌)

షాద్‌నగర్‌: ఇంట్లో ఉరేసుకొని పంచాయతీ సెక్రటరీ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం షాద్‌నగర్‌ పట్టణంలో వెలుగు చూసింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. నాగర్‌కర్నూల్‌ జిల్లా కల్వకుర్తికి చెందిన వెంకటయ్య (35) గత కొన్నేళ్లుగా షాద్‌నగర్‌ మండలంలోని కంసాన్‌పల్లి గ్రామ పంచాయతీ సెక్రటరీగా విధులు నిర్వహిస్తూ కుటుంబ సభ్యులతో కలిసి షాద్‌నగర్‌ పట్టణంలోని సాయిబాలాజీ టౌన్‌షిప్‌లో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో వెంకటయ్య మంగళవారం సాయంత్రం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుటుంబ కలహాల నేపథ్యంలో వెంకటయ్య ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తుంది. మృతుడికి భార్య, ఓ బాబు ఉన్నాడు.

వ్యక్తి అదృశ్యం



మధు

ఇబ్రహీంపట్నం: ఇంటినుంచి తప్పిపోయిన వ్యక్తి ఆచూకి తెలిస్తే ఇబ్రహీంపట్నం పోలీసులకు తెలియజేయాలని ఎస్‌ఐ మైబెల్లి కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నంకు చెందిన పుట్ట మధు(34)కు మతిస్థిమితం సరిగా లేదన్నారు. సుమారు రెండు నెలల క్రితం ఇంటినుంచి వెళ్లిపోయినట్లు తెలిపారు. బంధువులతోపాటు పలుచోట్ల వెతికినా అతని ఆచూకీ లభ్యం కాకపోవడంతో అతని తల్లి ధనమ్మ పీఎస్‌లో ఫిర్యాదు చేశారని తెలిపారు. తెలుగు మాట్లాడే అతను ఇంట్లో నుంచి వెళ్లిపోయినప్పుడు ఒంటిపై రెడ్‌కలర్‌ షర్ట్‌, బ్లాక్‌ కలర్‌ పాయింట్‌ ధరించి ఉన్నట్లు చెప్పారు. ఈ మేరకు మిస్సింగ్‌ కేసు నమోదు చేసామని.. మధు ఆచూకీ తెలిసినవారు ఇబ్రహీంపట్నం పోలీ స్టేషన్‌లో సమచారం ఇవ్వాలని కోరారు.

అంబేడ్కర్‌ బాటలో నడుద్దాం

ఎంపీ రంజిత్‌రెడ్డి



అంబేడ్కర్‌ విగ్రహానికి నివాళులర్పిస్తున్న రంజిత్‌రెడ్డి

అనంతగిరి: అంబేడ్కర్‌ వర్ధంతి సందర్భంగా బుధవారం వికారాబాద్‌ పట్టణంలోని ఆయన విగ్రహానికి ఎంపీ రంజిత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆనంద్‌ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వారు మాట్లాడుతూ.. యువత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ చూపిన బాటలో నడవాలన్నారు. ఆయన ఆశయ సాధనే లక్ష్యంగా తాము పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ నాయకులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

బార్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో..

వికారాబాద్‌లోని బార్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో అంబేడ్కర్‌ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి, వెంకటేశ్‌, జయలతారెడ్డి, రఫీ, ఆనంద్‌, వరుణ్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, రాజశేఖర్‌, జనార్ధన్‌, ఈశ్వర్‌రెడ్డి, పరమేష్‌, రాజు, చాంద్‌పాషా, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అదిగో పులి..

- చేవెళ్ల మండలంలో పులి సంచరిస్తోందంటూ పుకార్లు
- గ్రామాల్లో ఫారెస్టు అధికారుల పరిశీలన
- ఆనవాళ్లు కనిపించలేదని వెల్లడి



ముడిమ్యాలలో స్థానికులతో మాట్లాడుతున్న ఫారెస్టు అధికారులు

చేవెళ్ల: చేవెళ్ల మండలంలో పులి తిరుగుతుందనే ప్రచారం 15రోజులుగా సోషల్‌ మీడియాలో చక్కర్లు కొడుతూనే ఉంది. మా గ్రామంలో కనిపించిందని ఒకరోజు అంటే మరోరోజు మా గ్రామంలో కనిపించిందని వాయిస్‌ మేసేజ్‌లు వాట్సాప్‌ గ్రూపుల్లో చక్కర్లు కొడుతున్నాయి. మండలంలోని ముడిమ్యాల అటవీ ప్రాంతంలో మంగళవారం.. రోడ్డు పక్కన, గ్రామ సమీపంలో కనిపించిందనే వాయిస్‌ మేసేజ్‌లు వాట్సాప్‌ గ్రూప్‌లో హల్‌చల్‌ చేశాయి. ఈ విషయం గ్రామంలో తెలియటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఆలూరు, కమ్మెట, ఊరేళ్ల, మొండివాగు, తంగడపల్లి, ముడిమ్యాల, కందవాడ తదితర గ్రామాల్లో పులి కనిపించిందంటూ పుకార్లు తిరుగుతున్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు భయం గుప్పిట్లో గడుపుతున్నారు.

భయపడాల్సిన పనిలేదు..

ఈ క్రమంలో బుధవారం ముడిమ్యాల గ్రామం, అటవీ ప్రాంతంలో పారెస్ట్‌ రేంజ్‌ అధికారి ప్రతిమ, వైల్డ్‌ ఆనిమల్‌ ఎక్స్‌పర్ట్‌ జలీల్‌ మండలంలోని ముడిమ్యాల గ్రామం, అటవీ ప్రాంతంలో పరిశీలించారు. పులికి సంబంధించిన ఎలాంటి ఆనవాళ్లు కనిపించలేదని తెలిపారు. గ్రామస్తులు చెప్పిన ప్రదేశాల్లో కూడా పరిశీలించామని ఆయా గుర్తులు కూడా పులివి కానీ, చిరుతవి కానీ కావాని అవి సాధారణంగా ఉండే జంతువులవేనని తెలిపారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు.

కెమెరాలు అమర్చాం



పెద్ద పులి ఇలాంటి ప్రదేశాల్లో తిరిగే అవకాశం లేదు. ప్రజలు రాత్రివేళల్లో ఒంటరిగా తిరగవద్దు. ఒకవేళ వెళ్తే చేతిలో కర్ర పట్టుకొని వెళ్లాలి. ముందు జాగ్రత్తగా గ్రామస్తులు చెప్పిన ప్రాంతాలతో పాటు అటవీ ప్రాంతంలో ప్రత్యేక కెమెరాలను అమర్చామన్నారు.

– ప్రతిమ, ఫారెస్టు రేంజ్‌ అధికారి

శంకర్‌పల్లి రైల్వే ట్రాక్‌ సమీపంలో..

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



కుమార్‌ మృతదేహం

శంకర్‌పల్లి: శంకర్‌పల్లి పీఎస్‌ పరిధిలోని రైల్వే ట్రాక్‌ పక్కన గల పంట పొలాల్లో అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి శవమై కనిపించిన సంఘటన స్థానికంగా కలకలం రేపింది. శంకర్‌పల్లి పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని అలాన్‌ఖాన్‌గూడ గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామమైన చిన్నారెడ్డిగూడకి చెందిన కుమార్‌(32) మంగళవారం ఉదయం 9గంటలకు శంకర్‌పల్లికి వెళ్లాలని చెప్పి ఇంట్లో నుంచి బయలుదేదాడు. కాగా బుధవారం మధ్యాహ్నం శంకర్‌పల్లి పట్టణ శివారులోని రైల్వేట్రాక్‌ పక్కన గల పంట పొలాల్లో రైతులకు ఓ గుర్తుతెలియని శవం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వివరాలను సేకరించగా చిన్నరెడ్డిగూడ గ్రామానికి చెందిన కుమార్‌గా గుర్తించారు. మృతుడి ఒంటిపై ఎటువంటి గాయాలు లేవని చెప్పారు. మద్యం మత్తులో ట్రాక్‌వద్దకు వెళ్లి మృతి చెంది ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు డిటెక్టివ్‌ ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు.

హామీలను అమలు చేయాలి

మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌



ఆమనగల్లు: కాంగ్రెస్‌ ప్రకటించిన ఆరు గ్యారెంటీ స్కీంలను ఖచ్చితంగా అమలు చేయాలని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన అన్ని హామీలను అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. ప్రజలు తనకు మూడుసార్లు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించారని.. తనహయాంలో కల్వకుర్తి అభివృద్ధికి కృషిచేశానని చెప్పారు. పదవి ఉన్నా లేకున్నా ప్రజల మధ్యే ఉంటానని జైపాల్‌యాదవ్‌ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజలతో సఖ్యతగా మెలగాలి

డీసీపీ నారాయణరెడ్డి



సిబ్బందికి సూచనలిస్తున్న డీసీపీ నారాయణరెడ్డి

కడ్తాల్‌: కడ్తాల్‌ పోలీస్‌ స్టేషన్‌ను శంషాబాద్‌ డీసీపీ నారాయణరెడ్డి బుధవారం తనిఖీ చేశారు. పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో ఏడాదికాలంగా నమోదైన కేసుల వివరాల గురించి ఆరా తీయడంతో పాటు రికార్డులను పరిశీలించారు. ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సమర్థవంతంగా విధులు నిర్వహించినందుకు పోలీస్‌ అధికారులను, సిబ్బందిని డీసీపీ అభినందించారు. అదేవిధంగా పోలీసుల విధులను, సమస్యలను తెలుసుకోవడంతో పాటు శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు, సూచనలు అందజేశారు. ప్రజలతో సఖ్యతగా మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్‌ ఏసీపీ రంగస్వామి, ఎస్‌హెచ్‌ఓ శివప్రసాద్‌, ఎస్‌ఐ హరిశంకర్‌గౌడ్‌, పోలీస్‌ సిబ్బంది ఉన్నారు.

అక్రమంగా పంటల కోత

నిందితులపై భూయజమానుల ఫిర్యాదు

దోమ: తాను సాగుచేసిన పంటలను అక్రమంగా కొందరు వ్యక్తులు కోతలు చేసినట్లు సదరు రైతు దోమ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ రవిగౌడ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని మోత్కూర్‌కి చెందిన రంగంపల్లి వెంకటయ్య, రంగంపల్లి రాములు అనే రైతులకు సర్వే నంబర్‌ 519లో 4ఎకరాల 20గుంటల భూమి ఉంది. అట్టి భూమి కోర్టు పరిధిలో కేసు కొనసాగుతున్నప్పటికీ, ఏళ్ల తరబడి అదే రైతులు కాస్తులో ఉంటూ వివిధ పంటలను సాగు చేసుకుంటున్నారు. అయితే నవంబర్‌ 20వ తేదీన గ్రామానికి చెందిన మక్బూల్‌, కౌసర్‌బేగం, సోహెల్‌, మౌలాన, జబ్బార్‌, తిరుమల్‌రెడ్డి, మహమూద్‌, అఖిల్‌, వడ్డే చంద్రకళ, వడ్డే లక్ష్మి, వడ్డే సునీత, వడ్డే నారాయణ.. సాగు చేసిన భూమి తమదంటూ బాధిత రైతులను భయభ్రాంతులకు గురిచేసి సాగు చేసిన పంటలను హార్వెస్టర్‌ సహాయంతో కోతలకు గురిచేశారు. అట్టి ధాన్యాన్ని ట్రాక్టర్ల ద్వారా తీసుకెళ్లడంతో బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టగా..ప్రస్తుతం సాగు చేస్తున్న రైతులను భయభ్రాంతులకు గురి చేయడమే కాకుండా పంటను కోతకు గురిచేసి తీసుకెళ్లిన వ్యక్తులపై కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్‌ఐ రవిగౌడ్‌ తెలిపారు.

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ

మొయినాబాద్‌ రూరల్‌: మండల పరిధిలోని అమ్డాపూర్‌ గ్రామం అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. బుధవారం గ్రామానికి చెందిన గొల్లపల్లి మైపాల్‌రెడ్డి 18వ మహాపడి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా గొల్లపల్లి కిష్టమ్మ పూజను ఏర్పాటు చేయగా అన్నదాన ప్రభువుగా గొల్లపల్లి భరత్‌కళ్యాణ్‌రెడ్డి నిర్వహించారు. కేశవ్‌ గురుస్వామి ఆధ్వర్యంలో పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మాలధారణ స్వాములు పాడిన పాటలతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. గురుస్వాములు రాంచందర్‌, బల్వంత్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. భజన మండలి జంగిరెడ్డి పాడిన అయ్యప్ప పాటలతో అయ్యప్ప మాల ధరించిన స్వాములు నృత్యాలు చేశారు.

కొత్తూరు: కొత్తూరు పట్టణంలోని హనుమాన్‌ ఆలయ ఆవరణలో అయ్యప్ప స్వాములకు స్థానిక కాంగ్రెస్‌ నాయకుడు వీరమోని దేవేందర్‌ముదిరాజ్‌ అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవార్చుకోవాలని కోరారు. నర్సింహ్మ, శ్రీనివాస్‌, తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్‌లో..

షాద్‌నగర్‌: పట్టణంలోని ఎల్‌ఎన్‌ కాలనీలో శ్రీ శివ మారుతీ గీతా అయ్యప్ప మందిరంలో బుధవారం కిషన్‌నగర్‌ గ్రామానికి చెందిన కుమ్మరి అశోక్‌ కుటుంబ సభ్యులు అయ్యప్ప స్వాములకు అన్నదానం నిర్వహించారు. నిర్వాహకులు గోలెపు చంద్రశేఖర్‌, బసప్ప, మాజీ మున్సిపల్‌ చైర్మన్‌ అగ్గనూరు విశ్వం, మంజు శ్రీ రాఘవేందర్‌, రేటికల్‌ నందీశ్వర్‌, తదితరులు పాల్గొన్నారు.



షాద్‌నగర్‌: పూజలో అయ్యప్ప స్వాములు

ఓడినా.. నైతిక విజయం మనదే



సమావేశంలో మాట్లాడుతున్న భీంభరత్‌

చేవెళ్ల: అసెంబ్లీ ఎన్నికల్లో చేవెళ్లలో కాంగ్రెస్‌ పార్టీ స్వల్ప మెజార్టీతో ఓడినప్పటికీ నైతికంగా విజయం సాధించినట్లేనని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పామెన భీంభరత్‌ అన్నారు. చేవెళ్లలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎంతో కష్టపడి పనిచేశారని వారందరికి పాదాభివందనం చేస్తున్నట్లు చెప్పారు. తాను స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోవటం జరిగిందని.. దీనికి కారణం కొన్ని గ్రామాల్లో కాంగ్రెస్‌ పార్టీ సంస్థాగతంగా గట్టిగా లేకపోవటంతో పాటు కమిటీలు లేకపోవడమేనని తెలిపారు. అవతల పోటీలో ఉన్న అభ్యర్థి రెండుసార్లు ఎమ్మెల్యేగా పోటీచేసిన వ్యక్తి కావటంతో పాటు అధికార పార్టీ బలం, గ్రామాల్లో బలమైన ప్రజాప్రతినిధులు, కేడర్‌ ఉండటంతో వారిని బలంగా ఢీకొట్టి పార్టీ కోసం అందరూ కలిసి పనిచేశారని చెప్పారు. అందరి కష్టం ఫలితంగానే మనం గట్టి పోటీ ఇచ్చామన్నారు. మనం ఇక్కడ ఓడినా మన పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందని మన వెనక గట్టి బలం ఉందనే అందరూ విశ్వసించాలన్నారు. ఇకరాబోయే అన్ని ఎన్నికల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటానన్నారు. డీసీసీ మాజీ అధ్యక్షుడు పడాల వెంకటస్వామి, పీసీసీ ఉపాధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి, సీనియర్‌ నాయకులు బల్వంత్‌రెడ్డి, ఆగిరెడ్డి, వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. చేవెళ్లలో స్వల్ప మెజార్టీతో ఓడిన పామెన భీంభరత్‌కు ఏదైనా నామినేటెడ్‌ లేదా ఎమ్మెల్సీ పదవిని ఇవ్వాలని కోరారు. అప్పుడే పార్టీ నియోజకవర్గంలో మరింత బలపడుతుందని చెప్పారు. రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకరణ కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని భీంభరత్‌ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నియోజకవర్గ నాయకులు వసంతం, మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మల్లారెడ్డి, టేకుపల్లి శ్రీనివాస్‌, మధుసూదన్‌గుప్తా, ప్రభాకర్‌, క్రిష్ణగౌడ్‌, శైలజ, సమత, నర్సింహులు, మహేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్‌బాబు, శ్రీనివాస్‌గౌడ్‌, ప్రభాకర్‌రెడ్డి, తరుణ్‌, శ్రీనివాస్‌, కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.